# తోడు



**- ఎ.బి.సుందరరావు**

అసలే ఆదివారం అందులోకీ అభిమాన హీరో నటించిన 'సూపర్ డూపర్ హిట్' – పిక్చరు – ఆవేళే రిలీజు 'ఫస్టుడే', ఫస్టుషోకి వెళ్ళితీరాలి!. ఇహ మా 'విశ్వి'గాడి హడావిడి చెప్పతరం కాదు. మధ్యాహ్నం రెండు గంటల నుంచే నన్నూ, రవణ గాడినీ సతాయించడం మొదలెట్టాడు. సాయంత్రం నాలుగయేసరికి హాలువద్ద మా ఇద్దర్నీ రెడీగా వుండమని మరీ మరీ చెప్పేడు, వాడికి తోడుకావాలి.

వాడు అనుకున్నాడంటే ఆ రోజు పిక్చరు చూడాల్సిందే. వాడి నిఘంటువులో 'హౌస్ ఫుల్' అన్నపదం ఉండదు. దేబిమొహం వేసు కుని ఉసూరుమంటూ సినిమా చూడకుండా తిరిగి రావడం వాడి చరిత్రలో లేదు. తోడులే కుండా ఒంటిరిగా వాడు వెళ్ళడు. నిజానికి 'విశ్వి'గాడి సంగతెలావున్నా ఆ రోజు మా ఇద్దరికీ పండగే. సినిమాతో పాటు తతిమ్మా అన్ని ఖర్చులూ వాడివే. వాడా ముక్క అనేసరికి మాకూ ఉబలాటం ఎక్కువయింది. దాంతో పాటు టెన్షను. వాడు టిక్కెట్లు సంపాయించగలడా? వాడివల్ల అవుతుందా? ఆ రోజు సంతోషంగా గడిచే అవకాశం వుందా అని.

'విష్ యూ బెస్టాఫ్ లక్' అని వాణ్ని 'గ్రీట్' చేసి ముందుగా వాడిని పంపేసాం, సరిగ్గా సాయంత్రం నాలుగయ్యేసరికి నేనూ రవణా 'టిప్ టాప్' గా ముస్తాబయి రూమ్‌కి లాక్ వేసి ఇలా మెట్లు దిగేమో లేదో, చాలాదూరం నుంచి వచ్చిన రవణగాడి ఫాదర్ ఆటోలో దిగేరు.

మా యిద్దరికీ నవనాళ్ళూ కృంగిపోయాయి. రవణదీనంగా నా కళ్ళలోకి చూసి. . .

"ఒరే అబ్బాయ్! నీకు తెల్సుకదా మా బాబు 'ఛండశాసనుడు'! నే నెలాగూ రాలేను కదా! కనీసం నువ్వేనా వెళ్ళకపోతే విశ్విగాడు ఏడుస్తాడు. వాడికెలాగో సర్దిచెప్పి పిక్చరు మీ ఉభయులూ ఎంజాయ్ చెయ్యండి'' అంటూ అభ్యర్థించాడు."తోడు లేకపోతే వాడు పిక్చర్ ఎంజాయ్ చెయ్యలేడు! అన్నాడు.

'సరే' అనిచెప్పితప్పదన్నట్టు నేనొక్కడినే హాలు వేపు బయల్దేరాను. ఎంత తొందరగా వెళ్ళి వాణ్ణి కలుద్దామనుకున్నా, ఈ గొడవ వలన బాగా ఆలస్యం అయింది. మరో పది నిముషాల్లో ఆట మొదలవుతుందనే సరికి, ఆదరా బాదరా విశ్విగాడ్ని కలిసాను. వాడు అప్పటికే మా గురించి ఆతురతగా ఎదురు చూస్తున్నాడు.

'వాడేడీ?' అన్నట్టు ప్రశ్నార్థకంగా నావేపు చూసాడు. జరిగిన కథంతా చెప్పేను. అంతా విని 'ప్చ్' అన్నాడు.... 'సరే పోనీ! నువ్వేనా వచ్చావు అంతేచాలు!... అన్నాడు. వాడికి తోడు కావాలి.

జేబులోంచి మూడు టిక్కెట్లు తీసాడు. మధ్యాహ్నం రెండు గంటల్నుంచీ టిక్కెట్టు క్యూలో తను ఎంత అవస్థ పడిందీ, చెమటపట్టి నీరసించిన వాడి మొహం, నలి గిన వాడి డ్రస్సూ రేగిన జుట్టూ చూస్తేనే తెలిసిపోతోంది. 'పాపం పూర్ ఫెలో'... అనుకున్నాను.

సరే! ఈ మూడో టిక్కెట్టు ఎవరికేనా ఇచ్చేద్దాం.. 'టైమవుతోంది పద' ... అన్నాడు. వాడి ననుసరించాను. 'హౌస్ ఫుల్' అని బోర్డు

తగిలించేసరికి చాంతాడంత క్యూ విస్ఫ్రహగా చెదిరిపోతున్నారు.

''సార్ ,మావాడు రాలేదు ఒకటిక్కెట్టు మిగిలిపోయింది కావాలా?" అని ఎవర్నో అడిగాడు. ఆ పెద్దమనిషి మావాడి వంక ఆశ్చర్యంగా — అనుమానంగా చూపి వెళ్ళిపోతున్నాడు.


ఇంకోకాయన మా ముందుకు వచ్చి "ఎంతండీ"? అని అడిగేడు.

"ఎంతేవిటండీ! అసలు ఖరీదే ఇప్పించండి పన్నెండు రూపాయలు"అన్నాడు విస్సిగాడు.

'ఆ పన్నెండే! ఓన్లీ ట్వెల్వ్' .. ''ఒద్దు బాబూ! ఇదేదో... నమ్మలేం తీరా హాల్లోకి వెళ్ళింతర్వాత ...'' అంటూ గొణుగుతూ వెళ్ళిపోయాడు.

మా చుట్టూ మరో పదిమంది చేరేరు. ఒక ర్నాకరు తోసుకుంటూ 'నాక్కావాలంటే — నాక్కావాలి' అని వాడిని చుట్టేస్తున్నారు.

"పదిహేను... ఇరవై.. ఇరవై అయిదు" ఇస్తామంటూ వాడిని ఊపిరాడకుండా చేస్తున్నారు.




విజిల్ శబ్దం... బూట్లూ టకటకా లాఠీ ఝుళిపింపులూ తోపులాట కేకలూ వాతావరణం ఘుల్లు మంది.

నన్నూ మావాడినీ చొక్కాపట్టుకుని బర బర 'వేన్' దగ్గరకు లాక్కుపోతున్నారు. మేం అలాంటి వాళ్ళం కాదని కాళ్ళా వేళ్ళా ఎంత బతిమాలి బతిమాలినా లాభం లేక పోయింది.

వేన్‌లో ఇంకా కొంతమంది కుర్రాళ్ళు మా ఈడు వాళ్ళే ఉన్నారు. మా వేపు చూసి నవ్వుతూ.'సార్!సార్' అంటూ విస్సిగాడు జేబులోంచి వారికి రూపాయలు తీసి వదిలేయమని ఆశపెట్టాడు.

''వదవ్వయ్యా బాబూ! ఈ రోజు నువ్వెంత ఇచ్చినా లాభం లేదు. ఇవాళ 'కేసులు రోజు' మరో రోజు అయితే బావుండేది. ఊ పద స్టేషనుకి. అక్కడ చెప్తుకో!" అంటూ ఒక్క తోపు తోసేసరికి ఇద్దరం వేన్‌లో పడ్డాం.

వెధవ రవణగాడు అదృష్టవంతుదు. బతికి పోయాడు అసలు వాడుంటే ఈ గొడవే లేక పోయేదిగా! ప్చ్....

'ఎంజాయ్ చెయ్యాల్సిన ఆదివారం ఇలా ఏడిపించింది

ఛు... లేచిన రోజు—వేళా విశేషం...
ఏవనుకున్నా ఏం లాభం
జరగాల్సింది జరిగిపోయింది
మొత్తం మీద విశ్సిగాడికి తోడయ్యాను.



ఒక పాపులర్ రచయిత (స్త్రీ)

సీరియల్

ఈ దేశంలో ఒక ఆడపిల్ల...
ఆమె వయసు .... పెళ్ళీడు
ఆమె మనసు ... కళ్ళెంలేని గుర్రం
ఆమె ఊహలు ... పుష్పక విమానం
ఆమె సెంటిమెంట్ ... జనరేషన్ గ్యాప్
వెరశి ... ఆమె... ?

ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక

పాఠకలోకానికి మేయిడ్-ఇన్-ఇండియా త్వరలో....!